సాక్షి చిత్తూరు

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



చలపరకోన..చారిత్రక వీణ

నగరి మండలంలోని ముడిపల్లి సమీపంలో ఉన్న చలపరకోన చారిత్రక ఆనవాళ్లకు సాక్ష్యంగా నిలుస్తోంది. - IIలో



డ్రోన్ సహాయంతో ఏనుగుల గుర్తింపు

అటవీ ప్రాంతాల్లో ఏనుగుల కదలికలను డ్రోన్ సాయంతో గుర్తిస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. - IIలో



బడబళ్లవంక ప్రాజెక్టు తూముకు గండి

రొంపిచెర్ల- పులిచెర్ల మండలాల మధ్య ఉన్న బడబళ్లవంక ప్రాజెక్టుకు గండి పడడంతో పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది. - IIలో

న్యూస్‌రీల్

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ తుషార్ డూడీ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



తల్లిదండ్రులకు మహిళను అప్పగిస్తున్న డీఎస్పీ

నగరి: మతిస్థిమితం లేని మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళను ఆమె తల్లిదండ్రులకు అప్పగించి నగరి పోలీసులు మానవత్వం చాటుకున్నారు. ఈ నెల 16వ తేదీన నగరి పట్టణంలో సుమారు 30 ఏళ్ల వయసు గల ఒక మహిళ రోడ్డుపై తిరుగుతూ, అందరితో గొడవపడుతూ, నివాస ప్రాంతాల వద్దకు వెళ్లి సమస్యలు సృష్టించడం పోలీసుల దృష్టికి వచ్చింది. సీఐ విక్రమ్ మతిస్థిమితం లేని మహిళ ఎక్కడి నుంచో తప్పిపోయి వచ్చినట్లు గుర్తించి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్‌కు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్‌ఐ విజయనాయక్, మహిళా కానిస్టేబుల్ భార్గవి మతిస్థిమితం లేని మహిళ వివరాలు సేకరించారు. ఆమె పేరు ప్రస్తుథీషేన్ (31) అని, ఆమె భర్త పేరు రమేష్ అని వారి నివాస ప్రాంతం మధ్యప్రదేశ్ పఠాన్ జిల్లా, జబల్పూర్ అని కనుగొన్నారు. పోలీసు శాఖ ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు వివరాలు అందించారు. మహిళను చిత్తూరు వన్ స్టాప్ సెంటర్‌కి తరలించి, సిబ్బంది సహకారంతో 5 రోజులపాటు అవసరమైన చికిత్స అందించారు. మతిస్థిమితం లేని మహిళను ఆమె తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. మతిస్థిమితం లేని మహిళను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన నగరి పోలీసులను జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.



చిత్తూరు నగర శివారులో కూటమి పార్టీ నేత అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీ

మైనింగ్ మాఫియా..

అక్రమాలు ఆపరయా

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రకృతి సంపదను ఎడాపెడా దోచేస్తున్నారు. కొందరు నేతలు అయితే గుట్టలను కరిగించి నోట్ల కట్టలుగా సొమ్ము చేసుకుంటున్నారు. అధికార అండదండలతో రెచ్చిపోతున్నారు. అక్రమ సామ్రాజ్యం మైనింగ్ మాఫియాను విస్తరింపజేస్తున్నారు. చిత్తూరు నగర శివారులో అక్రమ క్వారీని దర్జాగా నడిపిస్తున్నారు. అడ్డగోలుగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని విలువైన ఖనిజ సంపద దోచుకుంటున్నారు. ఈ దందా సైతం ఆ రారాజే నడిపిస్తున్నారని కొందరు కూటమి నేతలు చెబుతున్నారు. ఇదే విషయంపై సీఎంఓ నుంచి ఆరా తీసినట్లు సమాచారం. అయితే ఈ అక్రమ మైనింగ్ కళ్లెదుటే జరుగుతున్నా.. మైనింగ్, రెవెన్యూ, సేల్స్ ట్యాక్స్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

- చిత్తూరులో రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా
- అక్రమ మైనింగ్ చేస్తూ.. అసోసియేషన్ పేరిట దొంగ బిల్లులు
- చిత్తూరు శివారులోని గ్రామదేవత గుట్ట నుంచి నల్లబంగారం దోచేస్తున్న వైనం
- రూ.లక్షలు విలువజేసే గ్రానైట్ తమిళనాడు, కర్ణాటకకు తరలింపు
- రారాజు కనుసన్నల్లోనే ఈ అక్రమ క్వారీ నిర్వహణ
- సాక్షి కథనంతో రారాజు అక్రమాలపై గళం విప్పుతున్న కూటమిలోని ఓ వర్గం
- దొంగ బిల్లుల వ్యవహారంతో పాటు మైనింగ్‌పై సీఎంఓ నుంచి ఆరా
- అయినా అధికారుల్లో చలనం రాదు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు జిల్లాలో మైనింగ్‌నే టార్గెట్‌గా చేసుకుని మస్తుగా కాసులు వెనుకేసుకుంటున్న ఆ రారాజు అన్యాయాలకు అంతులేకుండా పోయిందని కూటమిలోని ఓ వర్గం బడానేతలే గళం విప్పుతున్నారు. అంటే అక్రమ మైనింగ్ వ్యాపారం తీవ్రత ఏస్థాయిలో ఉందో తెలుస్తోంది. చిత్తూరు నగర శివారు, జీడీ నెల్లూరు మండలం లక్ష్మిరెడ్డిపల్లి గ్రామ సరిహద్దులో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. మాఫియాగా అవతారమెత్తిన కొందరు కూటమి నేతలు కొండలను కరిగిస్తూ కాసులు కురిపించుకుంటున్నారు. ఓ ప్రజాప్రతినిధి వెంచర్ నిమిత్తం గ్రామ సమీపంలోని గుట్టను మింగేస్తున్నారు. అలాగే చిత్తూరు నగర శివారు ప్రాంతంలోని గ్రామ దేవత గుట్టపై కన్ను పెట్టారు. ఆ గుట్టను తవ్వితే నల్లబంగారం బయటపడింది. ఇక ఆ దరిదాపునకు ఎవరూ రాకుండా.. చూస్తూ..రూ.కోట్లు విలువ చేసే గ్రానైట్‌ను భారీమొత్తంలో అప్పనంగా తరలించేస్తున్నారు. నిత్యం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు విలువ చేసే గ్రానైట్ తమిళనాడు, కర్ణాటక, చిత్తూరు జిల్లావ్యాప్తంగా దిగుతోందని సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు. ఇందుకు అధికారం అడ్డుగా ఉండడంతో స్థానికులు సైతం నోరు మెదపలేకపోతున్నారు. ఈ విషయం మైనింగ్ శాఖ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఈ మైనింగ్ మాఫియాను నడిపిస్తున్న వ్యక్తే దొంగ బిల్లుల వ్యవహారంలో ప్రధానపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఇలా ఉప్పందించారా..?

సాక్షిలో వచ్చిన కథనం ఆధారంగా కూటమిలోని కొందరు నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి ఉప్పందించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దొంగ బిల్లులు నడిపిస్తున్న ఆ నేత ఎవరు? సంస్థ పేరుతో ఎలా రిజిస్ట్రేషన్ చేశారు..? ఆ రిజిస్ట్రేషన్ ఏ రకంగా.. ఏ ప్రాతిపదికన చేసుకున్నారు ? ఆ సంస్థ, బిల్లులు నిజమైతే రిజిస్ట్రేషన్ నంబరు ఎక్కడ? గ్రానైట్ తరలింపునకు సహకరిస్తున్న వ్యక్తులు ఎవరు? ఎన్ని నెలలుగా ఇలా జరుగుతోంది ? నెలకు ఎంత సంపాదిస్తున్నారు ? అసోసియేషన్ పేరిట దొంగ బిల్లులు ఇవ్వడం వెనుక రహస్యం ఏమిటి ? అనే కోణంలో సీఎంఓ కార్యాలయం నుంచి విచారించినట్లు సమాచారం. దీనిపై జిల్లా యంత్రాంగం ద్వారా వివరాలు అడిగినట్లు తెలిసింది. అధికారులు కదిలితే తప్పా ఈ అక్రమ గుట్టు రట్టు కాదని పలువురు భావిస్తున్నారు.

అమ్మో.. రారాజు..

టీడీపీ కోసం వెన్నెముక విరిగేలా పనిచేసిన సీనియర్, జూనియర్ నేతలు, పార్టీ అంటే గొంతు కోసుకుని చనిపోయే కార్యకర్తలకు సైతం లేని పవర్.. పార్టీలో ఈ రారాజుకే ఉందనే వాదనలు చిత్తూరులో గట్టిగా వినిపిస్తున్నాయి. గ్రానైట్ అక్రమ వ్యాపారం మొత్తం ఈ రారాజే నడిపించడంపై కళ్లప్పగించి చూస్తూ.. కొందరు కూటమినేతలు తలదించుకుంటున్నారు. విదేశీ తెలివి తేటలు ఉపయోగించి గ్రానైట్ తరలింపులో దొంగ బిల్లుల వ్యవహారం నడిపిస్తోంది కూడా ఆ రారాజేనని ఆ నేతలు బహిర్గతం చేస్తున్నారు. సాక్షిలో ఆదివారం ప్రచురితమైన గ్రానైట్.. రైట్ రైట్‌తో ఆ నేత చేస్తున్న అక్రమాలను మింగలేక కక్కేశారు. నెలనెల రూ.పదులకోట్లు వెనుకేసుకుంటున్నారని ఆరోపించారు. చిత్తూరు కేంద్రంగా జరుగుతున్న అక్రమ గ్రానైట్ వ్యవహారాన్ని సొంత పార్టీ నేతలే అధిష్టానం, రాష్ట్ర మైనింగ్, జీఎస్టీ, రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయమైన సమాచారం.

పేద వ్యక్తికి దహన సంస్కారాలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు

పలమనేరు: పేదరికంలో ఉన్న ఒక మహిళ తన భర్తకు అంత్యక్రియలు చేయలేని దుస్థితిలో ఉండగా పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు ఆదుకున్నారు. ఆ వ్యక్తికి అంతిమ సంస్కారాలు చేసి మానవత్వం చాటుకున్నారు. స్థానిక కప్పలవీరాస్వామి వీధిలో కాపురం ఉంటున్న వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి అంతిమ సంస్కారాలు చేయడానికి ఆర్థిక స్తోమత లేక భార్య వీరిని ఆశ్రయించగా సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు చేశారు.

మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ అభ్యర్థులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చాలా ఏళ్లుగా అభ్యర్థులు కష్టపడి చదివి డీఎస్సీ పరీక్షలో తమ ప్రతిభను చాటారన్నారు. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో మ్యాన్యువల్ కౌన్సెలింగ్‌లో ప్రత్యక్షంగా ఖాళీలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తద్వారా అభ్యర్థులు సంతోషంగా విధులలో చేరే అవకాశం ఉంటుందన్నారు. తప్పనిసరిగా మ్యాన్యువల్ కౌన్సెలింగ్ అమలు చేసి తీరాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 82,042 మంది స్వామివారిని దర్శించుకోగా 23,393 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతుండగా, టిక్కెట్లు లేని వారికి 8 గంటల్లో లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : దివ్యాంగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా సమగ్ర శిక్షా శాఖ ఏపీసీ వెంకటరమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలో దివ్యాంగులకు అసెస్‌మెంట్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీసీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులు వికలత్వంపై కుంగిపోకూడదని, దివ్యాంగులుగా ఉంటూ ఎంతోమంది ఉన్నత పదవులు, ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో అసెస్‌మెంట్ క్యాంప్‌లు నిర్వహించినట్లు తెలిపారు. చిత్తూరులో నిర్వహించిన ఐదవ క్యాంప్‌లో 50 మంది దివ్యాంగ విద్యార్థులకు వైద్యులు అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ నెల 22వ తేదీన గంగాధరనెల్లూరు ప్రాథమిక పాఠశాలలో ఆరవ అసెస్‌మెంట్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ హేమలత, బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, ఎంఈఓలు మోహన్, హసన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ

పూర్తి స్థాయిలో నిండిన వైఎస్సార్ జలాశయం



వైఎస్సార్ జలాశయం వద్ద పూజలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: మండలంలోని కాలువపల్లి వద్దనున్న వైఎస్సార్ జలాశయం వరద నీటితో పూర్తిస్థాయిలో నిండింది. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బందితో కలిసి ఆదివారం ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిండినందున పట్టణవాసులకు తాగునీటికి సమస్య ఉండదన్నారు. ప్రాజెక్టు వద్ద ఫిల్టర్ బెడ్లు, మోటార్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.

మొరవ పారుతున్న వెంకటపతయ్య చెరువు




గంగమ్మకు హారతి ఇస్తున్న మహిళలు

బైరెడ్డిపల్లె: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని తీర్థం సమీపంలో ఉన్న వెంకటపతయ్య చెరువు నిండి పొంగి మొరవపోతోంది. దీంతో గ్రామస్తులు ఆదివారం గంగమ్మకు పూజలు చేశారు. చెరువు నిండడంతో సాగునీటికి ఇబ్బంది ఉండదని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పేదల భూములపై పచ్చ పంజా



జగన్నాథపురంలో కూటమి నాయకులు ఆక్రమించుకోవాలనుకుంటున్న భూమి



దివంగతనేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఇచ్చిన పట్టాదారు పాస్‌బుక్

- మహానేత వైఎస్సార్ పేదలకు ఇచ్చిన భూములపై టీడీపీ నేతల కన్ను
- విజయపురం మండలం జగన్నాథపురంలో వెలుగు చూస్తున్న మరో అక్రమం
- పేదలకు ఇచ్చిన భూముల్లో చదును చేస్తున్న వైనం
- ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోండని బెదిరిస్తున్న నేతలు
- తమ భూముల జోలికి వస్తే పోరాటాలకు సిద్ధమంటున్న హక్కుదారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయపురం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఏడాది కాలంగా గ్రావెల్ అక్రమ రవాణాతో రెచ్చిపోయిన నాయకులు ఇప్పుడు భూకబ్జాకు పథక రచన చేస్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా అధికారం ఉండగానే కాసులు వెనుకోవాలనే యోచనతో ఎడాపెడా ప్రకృతి సంపదను కాజేస్తూ.. ప్రభుత్వ భూములను, పేదలకు ఇచ్చిన భూములను ఆక్రమించేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు గ్రావెల్ అక్రమ రవాణా, భూకబ్జాలకు పాల్పడుతున్నారు. తాజాగా గతంలో భూమి లేని నిరుపేదలకు అందజేసిన అసైన్డు భూమిని విజయపురం టీడీపీ నేతలు తమ అనుచరులకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు.

భూమిలేని పేదలకు పంచిన మహానేత

విజయపురం మండలం జగన్నాథపురం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 206, 207లో 200 ఎకరాల భూమిని 2006లో అప్పటి సీఎం మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పన్నూరుకు చెందిన సుమారు 200 మంది ఎస్సీ, ఎస్టీలకు ఎకరా చొప్పున 200 ఎకరాలను పంపిణీ చేసి పట్టాలు ఇచ్చారు. అయితే ఇప్పుడు ఆ భూములను ఆక్రమించుకోవడానికి కూటమి నేతలు సిద్ధమయ్యారు. గత వారం రోజులుగా ఆ భూమిని కబ్జా చేసేందుకు తెరచాటు రాజకీయాలు చేస్తున్నారు. ఇప్పటికే ముళ్ల చెట్లు తొలగించడం, భూమిని చదును చేయడం వంటి కార్యక్రమాల ను చేపట్టారు. తమకు పట్టాలు ఇచ్చిన భూమిలో మీరెందుకు చదును చేస్తున్నారని ప్రశ్నిస్తే.. దిక్కున్న చోట చెప్పుకోండని బెదిరింపులకు దిగుతున్నారని హక్కుదారులు వాపోతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటున్నారు. తమ భూముల జోలికి వస్తే పెద్దఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

చదును చేస్తున్నా పట్టించుకోలేదు



జగన్నాథపురం అడవిలో కొందరు భూములను చదును చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. పట్టాదారులకు కూడా ఈ విషయం తెలియదు. అయితే తహసీల్దార్ అనుమతితోనే చదును చేస్తున్నట్లు తెలిసింది. జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. – కుమార్, పన్నూరు సర్పంచ్

మా భూములు చూపండి



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2006లో ఎస్సీ, ఎస్టీలకు భూములు ఇచ్చారు. ఆ భూములు చూపాలని రెవెన్యూ అధికారులను అడిగాం. ఇంత వరకు చూపలేదు. జిల్లా అధికారులు వెంటనే మాకు సంబంధించిన భూములు ఎక్కడ ఉన్నాయో చూపాలి.

– ఆనందరాజ్, పట్టాదారుడు, పన్నూరు

ఎవరికీ అనుమతి ఇవ్వలేదు..



జగన్నాథపురంలో భూములు చదువును చేస్తా ఉన్నారని తెలిసింది. వెంట నే మా సిబ్బంది పంపించి నిలిపివేశాం. ఎవరైనా పట్టాలు ఉంటే వారికి సంబంధించిన భూములను చూపిస్తాం. పట్టాలు పాసుపుస్తకం లేకుండా భూములను చదును చేస్తే కఠిన చర్యలు తప్పవు. – కిరణ్, తహసీల్దార్, విజయపురం

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో ఈ నెల 23వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల నిర్వహణకు అధికారిక యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా ఆధార్ కార్డుల్లో బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సిన పిల్లలు 46 వేలకు పైగా ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ పిల్లలు తమ ఆధార్ కార్డుల్లో బయోమెట్రిక్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి చేశారు. పుట్టిన పిల్లలకు వేలిముద్రలు లేకుండా ఆధార్‌ను జారీచేస్తారు. అటువంటి పిల్లలు ఆధార్ జారీ అయిన 5 నుంచి 15 ఏళ్లలోపు వయసున్న వారు, 15 ఏళ్లకు పైబడిన వారు కచ్చితంగా తమ ఆధార్ కార్డుల్లో బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 23, 24, 25 తేదీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన 125 కేంద్రాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

చిరుత సంచారం

ఐరాల: మండలంలోని నగరి గ్రామ అటవీప్రాంతం సమీపంలో ఉన్న పొలాల వద్ద ఆదివారం సాయంత్రం చిరుత సంచరిస్తున్నట్లు డీఆర్‌ఓ రాకేష్‌కుమార్ తెలిపారు. నగరి గ్రామ సమీపంలోని పొలాల వద్ద పనులు చేసుకుంటున్న రైతులు చిరుత సంచారాన్ని గుర్తించి భయభ్రాంతులకు గురయ్యారు. చిరుత సంచారంపై రైతులు వెంటనే సమాచారం అందించినట్లు డీఆర్‌ఓ తెలిపారు. చిరుత గత కొద్దిరోజులు నగరి అటవీ ప్రాంతంలోనే సంచరిస్తోందని, గతంలో కూడా పాడిపశువులపై దాడి చేసి చంపేసిందన్నారు. ఐరాల–చిత్తూరు మార్గంలో ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనబడితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆధునిక సమాజపు అడుగుజాడ గురజాడ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో ఆదివారం గురజాడ అప్పారావు 163వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ గురజాడ ఆనాటి దురాచారాలను ఖండిస్తూ సమాజానికి సైతం స్ఫూర్తినిచ్చి ఆధునిక సమాజానికి అడుగుజాడగా నిలిచారన్నారు .జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్ బాబు మాట్లాడుతూ, జన విజ్ఞాన వేదిక యువతకు మ్యాజిక్‌పై శిక్షణా తరగతులు నిర్వహించి విద్యార్థులతో గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలను రూపుమాపేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా పర్యావరణ విభాగం కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రతి స్కూల్లో ప్లాస్టిక్ వస్తువులను రీసైక్లింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షురాలు జయంతి, రాష్ట్ర జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వర్ మాట్లాడారు. జేవీవీ కోశాధికారి గిరిధర్ మూర్తి గురజాడ దేశభక్తి గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవే అధికారుల నిర్లక్ష్యం



బంగారక్క వద్ద మొరవను కొట్టివేసిన హైవే సిబ్బంది

- చెరువుల కట్టలు కూల్చివేత
- గ్రామాల్లోకి వస్తున్న వర్షపునీరు
- పట్టించుకోని స్థానిక అధికారులు

గుడిపాల: మండల కేంద్రమైన గుడిపాల మీదుగా చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే వెళుతోంది. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా చాలా ప్రాంతాల్లో చెరువు కట్టలు, మొరవలను ధ్వంసం చేశారు. తర్వాత వాటికి మరమ్మతులు చేయకపోవడంతో వర్షపు నీరు చెరువుల్లోకి వెళ్లకుండా గ్రామాల్లోకి చేరుతోంది. కొన్ని ప్రాంతాల్లో పొలాల్లోకి చేరుతుండడంతో పంటలు మునిగిపోతున్నాయి. ముఖ్యంగా గుడిపాల మండలంలోని బంగారక్క చెరువు కట్ట మట్టిని తొలగించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు చేరుతోందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చుట్టుపక్కల గ్రామస్తులు భయపడుతున్నారు. అలాగే మొరవను కూడా కొట్టివేశారు. దీంతో పాటు పశుమంద చెరువు, సుబ్బారెడ్డి చెరువు, చలిచీమల పల్లె చెరువుల కట్టలు, వాగులను ఎక్కడపడితే అక్కడ తవ్వేయడంతో వర్షపు నీరు ఇళ్లలోకి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

డ్రోన్ సహాయంతో ఏనుగుల గుర్తింపు

పులిచెర్ల(కల్లూరు) : ఏనుగుల ఉంటున్న, తిరుగుతున్న ప్రదేశాలను డ్రోన్ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని చిత్తూరు డీఎఫ్ఓ సుబ్బరాజు తెలిపారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి కల్లూరుపాళెం సమీపంలోని జూపల్లె బండ వద్ద డ్రోన్ల సాయంతో ఏనుగుల స్థావరాలను పరిశీలించారు. గత సంవత్సర కాలంగా ఈ ఏనుగుల గుంపు మండలంలోనే తిరుగుతూ పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. ఎన్ని చర్యలు తీసుకున్నా బయటకు పోవడం లేదు. ఇక్కడే ఉంటూ రోజూ ఏదో ఒక ప్రాంతంలో పొలాలపై పడి పంట నాశనం చేస్తున్నాయని క్షేత్రస్థాయి అటవీ అధికారులు వివరించారు. దీనిపై డీఎఫ్ఓ స్పందిస్తూ ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకుంటామని, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఆస్తి నష్టం, ప్రాణహాని కలుగకుండా చూడాలని ఆదేశించారు. తమకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్, ఎఫ్ఎస్ఓ మహమ్మద్‌షఫీ, ఎఫ్‌బీఓ మధు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలపై ఏనుగుల దాడి



దేవళంపేటలో వరిపంటను తొక్కేసిన ఏనుగులు

పులిచెర్ల(కల్లూరు) : పులిచెర్ల మండలంలోని దేవళంపేట, దిగువ మూర్తివారిపల్లె, జూపల్లె, కోటపల్లె, వీకే పల్లె, కుమ్మరపల్లె తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఆదివారం పంటలను నాశనం చేశాయి. మరో ఏనుగుల గుంపు పాతపేట, తలారివారిపల్లె, ఎద్దులవారిపల్లె గ్రామాల్లో సంచరిస్తూ పంటలపై దాడి చేసి నష్టం కలిగించాయి. అలాగే జూపల్లెలో సుబ్బ రత్నం, దేవళంపేటలో సుధాకర్, ప్రభాకర్, బసవరాజు పొలాల్లోని మామిడి, వరి పంటలను తొక్కి నాశనం చేశాయి. ఎక్కువగా వరిపంటలను నేల తొక్కి పారేవాయి. మండలంలో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ఏనుగులు దాడులు చేస్తూ అన్నదాతలకు నష్టం కలిగిస్తున్నాయి. వీటిని కట్టడి చేయకపోతే పంటలను సాగు చేసుకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

బంగారుపాళెం: మండలంలోని కీరమంద గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భార్య కనిపించడం లేదని ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వివాహిత ఉదయం బంగారుపాళెం ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మైనర్ బాలిక అదృశ్యం..

మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామానికి చెందిన ఓ మైనర్‌బాలిక అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఉదయం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మీడియా స్వేచ్ఛను హరించడం తగదు



ప్రశ్నించే హక్కు, సమాజంలో జరిగే తప్పొప్పులను వెలికి తీసే హక్కు మీడియాకు ఉంటుంది. వారి హక్కులను, స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం సబబు కాదు. ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తున్న సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై కేసులు పెట్టడం అన్యాయం. పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటాయి. ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తే కేసులు పెట్టడం కొత్త సంస్కృతి అనిపిస్తోంది. ప్రశ్నించే గొంతుల్ని అణగదొక్కాలనుకోవడం బాధాకరం.

– చంద్రారెడ్డి, విశ్రాంత తహసీల్దార్




ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పాలకులు చేసే తప్పులు, పొరపాట్లను ప్రజలకు చేరవేయడంలో పత్రికలది ప్రధానపాత్ర. ప్రజాస్వామ్య పరిరక్షణలో అవి కీలకపాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ అవినీతిని, పాలకుల వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజలకు వాస్తవాలను చేరవేస్తోందనే అక్కసుతో సాక్షిదినపత్రికపై కక్ష సాధింపులకు పాల్పడడం సరైన విధానం కాదు. సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి. కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే.

– సోమిరెడ్డి, విశ్రాంత వీఆర్వో అసోసియేషన్ నాయకులు

చలపరకోన..చారిత్రక వీణ





నగరి సమీపంలో ఉన్న చలపన కోన చరిత్రకు ఆనవాళ్లకు సాక్ష్యంగా నిలుస్తోంది. కోనలోని రాళ్లలో కొన్ని వేల ఏళ్ల చరిత్ర దాగుంది. ఆదిమానవుల జీవన శైలిని తెలిపే అనేక గుర్తులు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. ప్రాచీన చరిత్రను తెలిపే ఆధారాలు ఇక్కడ అనేకం. ఆది మానవుడి కాలం నాటి శిలా చిత్రలేఖనాలు, ఎరుపు వర్ణంలో మానవ చిత్రాలు, చక్రాల గుర్తులు దర్శనమిస్తాయి. మహర్షులు తపస్సు చేసినట్లు ఆనవాళ్ల సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ కోన ఖ్యాతిని పెంచి పర్యాటక కేంద్రంగా మార్చాలని నగరి ప్రజలు కోరుతున్నారు.


- చరిత్రకు ఆనవాళ్లు చలపనకోన కొండ గుహలు
- నాటి ఆదిమానవులు గీసిన చిత్రాలు.. మహర్షులు తపస్సు చేసిన గుర్తులు
- మెగాలిథిక్ కళకు సారూప్యత అంటున్న పురావస్తు అధ్యయనకారులు
- ఇక్కడి రాతి శాసనానికి 600 ఏళ్లు
- గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు నిర్మాణం
- పర్యాటక కేంద్రంగా మార్చాలని నగరి మండల ప్రజల కాంక్ష

నగరి : మండలంలోని ముడిపల్లి గ్రామం నుంచి 3 కి.మీ దూరంలో స్థానికంగా చలపరకోన కొండ ఉంది. ఇక్కడ వెలసిన చలపరమ్మ అనే దేవత కారణంగా ఈ ప్రాంతానికి ఈ పేరు వచ్చింది. స్థానిక ప్రజలు అమ్మవారికి పూజలు చేస్తారు. సమీపంలో ఉన్న గుహ లోపల చలపరమ్మ దేవత ఉండేదని చెబుతారు. ఈ ప్రదేశానికి దగ్గరగా గతంలో పురాతన శిలాయుగం పనిముట్లు గుర్తించబడ్డాయి. పరిసరాల్లో 3వ శతాబ్దం నాటి చారిత్రక అవశేషాలు కనుగొన్నారు.

రాతిశాసనానికి 600 ఏళ్లు

చారిత్రక విశేషాలకు నెలవుగా చెప్పుకునే చలపరకోన, నాగతీర్థం కొండలకు సమీపంగా కరియ మాణిక్య స్వామి ఆలయ సమీపంలో ఒక రాతి శాసనం ఏర్పాటు చేయబడింది. అందులో ప్రాచీన తమిళలిపిలో చెక్కబడి ఉన్న సమాచారం పురావస్తు శాస్త్ర వేత్తలు అధ్యయనం చేసిన మేరకు ఈ శాసనం 1426 సెప్టెంబరు 8వ ఏర్పాటుచేశారు. ఇప్పటికే ఈ శాసనం 600 ఏళ్ల పూర్తిచేసుకుంది.

ఉట్టి పడే రాతి కళ



చలపరకోన గుహలో ఆది మానవులు గీసిన చిత్రాలు దర్శనమిస్తున్నాయి. రాతి కళలో మానవ, జంతు, మత, రేఖాగణితం, తదితర వంటివి గుర్తించబడని డ్రాయింగ్‌లకు చెందిన అనేక చిత్రాలు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయి. చిత్రాలను గీయడానికి ఆది మానవుడు ఎరుపు, ఎరుపు గోధుమ, తెలుపు వర్ణద్రవ్యాలను ఉపయోగించాడు. ఈ రాతి గుహలోని రాతి కళ వివిధ పురావస్తు కాలాల ద్వారా కళాత్మక వ్యక్తీకరణల కొనసాగింపును చూపుతుంది. ప్రస్తుతం చలపరకోన రాతి గుహలో రాతిపై చెక్కిన చక్రాలు, త్రిశూలాలు, వృత్తాలు, ఒకరి చేతులు ఒకరు పట్టుకున్న మానవ వరుస, తల్లిదండ్రులు బిడ్డ చేయి పట్టుకుని నడుస్తున్న ఆకారాన్ని గుర్తించారు. ఆర్కియాలజికల్ అధ్యయనాలు వెల్లడించిన మేరకు ఆది మానవులు సహజంగా లభించే ఖనిజాలు, మూలికలు, జంతు పదార్థాలను వాటి పరిసర వాతావరణంలో కలపడం ద్వారా రంగులు వేశారు. పలు చిత్రాలు మసకబారి ఉన్నాయి.

మెగాలిథిక్ కళతో సారూప్యత



ప్రాచీన చరిత్ర, పురావస్తు శాస్త్ర పరిశోధకులు కొండగుహలోని చిత్రాల ఆధారంగా చేసిన పరిశోధనల్లో చల పరకోనలో చెక్కి ఉన్న చక్రాల బొమ్మలు మల్లయ్యపల్లి, సుండుపల్లి మెగాలిథిక్ సమాధుల్లో చిత్రించిన చక్రాలతో సారూప్యతలను కలిగి ఉన్నాయని, మానవ బొమ్మలు మల్లయ్యపల్లి మెగాలిథిక్ కళతో సారూప్యతలను కలిగి ఉన్నాయని వీటి ఆధారంగా చలపరకోన రాతికళ మెగాలిథిక్ కాలానికి చెందినదిగా ఉండవచ్చని పురావస్తు అధ్యయనకారులు చెబుతున్నారు. ఆపై ఇక్కడ నివశించిన మహర్షులు కొండగుహలో శివలింగం ప్రతిష్ట చేసి, రాతిపై తమిళంలో నాగదేవతకు ప్రతీకగా సర్పాలను 1894లో చెక్కినట్లు తెలుస్తోంది. వీటి ఆధారంగా ఈ ప్రాంతానికి నాగతీర్థం అనే పేరు స్థిరపడింది. ఇక్కడి కొండలపై మహర్షులు (మునులు) తపస్సుచేసినట్లుగా రాతిగుహల్లో నిర్మించుకున్న కుటీరాలు ఉన్నాయి. అందుకే ఈ మునిపల్లి కాస్త ముడిపల్లిగా మారిందని చరిత్రకారులు చెబుతారు.

ఎంతో విశిష్టత దాగుంది



చలపరకోన గుహలో ఆది మానవులు గీసిన చిత్రాలు కనిపిస్తాయి. పలు చిత్రాలు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయి. ఈ బొమ్మల పరిశీలన ఆధారంగా కొండ గుహల్లో కొన్ని వేల ఏళ్ల చరిత్ర ఇక్కడ దాగి ఉన్నట్లు స్పష్టమవుతుంది. విద్యార్థులకు ఆర్కియాలజీ గురించి వివరించడానికి ముడిపల్లి చలపరకోని, నాగతీర్థం ప్రాంతాల్లో ఎడ్యుకేషనల్ ఫీల్డ్ టూర్స్ కూడా నిర్వహిస్తాం.


– డాక్టర్ ఎస్.వినోద్, గెస్ట్ లెక్చరర్, డిపార్ట్‌మెంట్‌ఆఫ్ హిస్టరీ, ముడిపల్లి

పర్యాటక కేంద్రంగా మార్చాలి



చలపరకోన, నాగతీర్థంకు వేళ ఏళ్ల చరిత్ర ఉంది. గత ప్రభుత్వంలో జెడ్పీ నిధులతో నాగతీర్థం కొండవరకు సిమెంటు రోడ్డు వేశారు. గ్రామస్తుంతా కలసి నిధులు పోగుచేసి కొండ పైకి వెళ్లే మెట్లు నిర్మించుకున్నాం. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేసే నగరి దిండివనం రైల్వే లైను కొండపక్కనే వెళ్తోంది. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చితే ఇక్కడి విశిష్టత పలువురికి తెలిసే అవకాశం ఉంది.

– జయచంద్రారెడ్డి, ముడిపల్లి, నగరి మండలం



కొండరాళ్లపై గల చరిత్రకు ఆనవాలుగా నిలిచే చిత్రాలు





రాతిపై చెక్కబడిన వర్ధమాన మహావీరుడి ప్రతిమను చూపుతున్న పురావస్తు అధ్యయనకారులు, చలపరమ్మ ఆలయం



కొండరాళ్లపై గల చరిత్రకు ఆనవాలుగా నిలిచే చిత్రాలు

విద్యార్థిని అదృశ్యం కేసులో ముగ్గురి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

పుత్తూరు: గత ఆగస్టు 23వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యం కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు.. గేట్‌పుత్తూరుకు చెందిన జోషువ లారెన్స్, అనుప్రియ దంపతుల కుమార్తె జె.యోషిని(17) పుత్తూరులోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్మీడియెట్ తొలి ఏడాది చదువుతోంది. గత నెల 23వ తేదీన తన కుమార్తె యోషిని కనిపించడం లేదని, గేట్‌పుత్తూరు వీవర్స్ కాలనీకి చెందిన శరవణన్ కుమారుడు జ్యోతిప్రసాద్ తన కుమార్తెను తీసుకెళ్లి ఉంటాడని అనుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 14వ తేదీ సాయంత్రం యోషిని తన తల్లి అనుప్రియతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి వాంగ్మూలం ఇచ్చింది. యోషిని చెప్పిన వివరాల మేరకు.. గేట్‌పుత్తూరుకు చెందిన జ్యోతిప్రసాద్ తనను మోసపూరిత మాటలతో నమ్మించి, తమిళనాడులోని రెడ్‌హిల్స్‌లోని మదన్‌కుమార్, మల్లిక ఇంటిలో నిర్బంధించాడని తెలిపింది. వీరికి ప్రేమలత అనే మరో మహిళ సహాయం చేసినట్లు చెప్పింది. 20 రోజులపాటు నిర్బంధించిన జ్యోతిప్రసాద్ తన నోట్లో గుడ్డలు కుక్కి, పలుమార్లు లైంగిక దాడి చేశాడని వెల్లడించింది. రెడ్‌హిల్స్‌లోని వినాయకుడి ఆలయంలో బలవంతంగా వివాహం చేసుకున్నాడని తెలిపింది. పుత్తూరులో పోలీసు కేసు నమోదు అయిందన్న విషయం తెలుసుకున్న జ్యోతిప్రసాద్ ఈ నెల 14వ తేదీన పుత్తూరు–నారాయణవనం జంక్షన్ వద్ద తనను వదిలిపెట్టి వెళ్లిపోయాడని వెల్లడించింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పుత్తూరు పోలీసులు ఏ1 జ్యోతిప్రసాద్, ఏ2 ప్రేమలత, ఏ4 మల్లికను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏ3 మదన్‌కుమార్ పరారీలో ఉన్నాడు.

బడబళ్లవంక ప్రాజెక్టు తూముకు గండి

రొంపిచెర్ల: రొంపిచెర్ల–పులిచెర్ల మండలాల సరిహద్దులో ఉన్న బడబళ్లవంక ప్రాజెక్టు తూముకు శనివారం గండి పడింది. ఈ ప్రాజెక్టును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో రూ.34.57 కోట్లతో నిర్మించారు. కాలువ పనులను సైతం 80 శాతం పూర్తి చేశారు. దీని నుంచి 4 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ క్రమంలో ప్రాజెక్టు తూముకు శనివారం రాత్రి గండి పడింది. ఆదివారం ఉదయం నీరు వృథాగా పోతున్న విషయాన్ని గుర్తించిన స్థానికులు రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ అమరనాథ్, ఇరిగేషన్ ఏఈ మునిశేఖర్, ఎస్ఐ సుబ్బారెడ్డి అక్కడికి చేరుకుని పరిశీలించి రైతులతో మాట్లాడారు. శనివారం రాత్రి 9, 11 గంటల ప్రాంతంలో పెద్ద శబ్దం వచ్చిందని తెలిపారు. ప్రాజెక్టు తూము వద్ద పేల్చినట్లు గానీ, పగులగొట్టిన ఆనవాళ్లు కనిపించలేదని, తూముకు అమర్చిన బండ పగలడం వల్ల శబ్దం వచ్చి ఉండవచ్చని అధికారులు చెప్పారు.

మునిగిన 20 వ్యవసాయ మోటార్లు

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బడబళ్లవంక ప్రాజెక్టు 70 శాతం మేర నిండింది. మూడు అడుగుల ఎత్తు నీరు వస్తే ప్రాజెక్టు మొరవపోయే అవకాశం ఉంది. దీంతో ముంపు భూముల్లో ఉన్న 20 వ్యవసాయ బోరు మోటార్లు మునిగిపోయాయి. ఈ నేపథ్యంలో మోటార్లను బయటకు తీసుకునేందుకు తూమును పగులగొట్టారా? లేక పరిహారం మంజూరు కాకపోవడంతో ఆగ్రహంతో తూము బండను పగులగొట్టారా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



లీకేజీ పడిన బడబళ్లవంక ప్రాజెక్టు తూము



తూము లీకేజీతో నీట మునిగిన టమాట పంట

3 ఎకరాల పంట నీట మునిగింది



బడబళ్లవంక ప్రాజెక్టు నిండడం వల్ల 1.50 ఎకరాల వరి పంట, తూముకు లీకేజీ పడడంతో 1.50 ఎకరాల టమాట పంట నీట మునిగింది. ప్రభుత్వం ముంపు భూములకు ఇంతవరకు పరిహారం మంజూరు చేయలేదు. ప్రాజెక్టులోకి నీరు రావడంతో సుమారు 20 వ్యవసాయ బోర్లు కూడా మునిగిపోయాయి. ప్రభుత్వం ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని ముంపు భూములకు, నీట మునిగిన పంటలకు పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలి.

– గుర్రప్ప, గాదిచెరువుపల్లె, రైతు

పరిహారం కోసం నివేదిక ఇచ్చాం



బడబళ్ల వంక ప్రాజెక్టు నిర్మాణంలో రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల పరిధిలో ముంపునకు గురైన 382 ఎకరాల భూములకు పరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అప్పటి ప్రభుత్వం రైతులకు పరిహారం కోసం రూ.10.68 కోట్ల నిధులను కేటాయించింది. వాటిని ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్తాం.

– మునిశేఖర్, ఇరిగేషన్ ఏఈ

లీకేజీని అరికడతాం



బడబళ్లవంక ప్రాజెక్టు తూముకు పడిన లీకేజీని అరికడతాం. ఇసుక బస్తాలతో తూములో నీరు వృథాగా పోకుండా అడ్డు వేస్తాం. లీకేజీ పడిందా ? లేక ఎవరైనా తూమును పగలకొట్టారా అనే విషయమై విచారణ చేసేందుకు పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ముంపు భూములకు పరిహారం కోసం జిల్లా కలెక్టర్‌తో వారం రోజుల కిందటే చర్చించాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– అమరనాథ్, తహసీల్దార్

తర్పణం.. కిక్కిరిసిన 'తీర్థం'





తర్పణాలు వదులుతున్న జనం





అత్యంత అరుదుగా ఆదివారం మహాలయ అమావాస్య రావడంతో పితృ తర్పణాల సమర్పణకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కపిలతీర్థంలో పిండ ప్రదానం చేసేందుకు భారీగా క్యూ కట్టారు. ఈ మేరకు కపిలేశ్వర బ్రాహ్మణ పురోహిత సేవా సంఘం సభ్యులు శాస్త్రోక్తంగా ప్రక్రియ చేపట్టారు. వేకువజాము నుంచే సుమారు 200 మంది తర్పణ క్రతువుల నిర్వహణకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలోనే పితృ రుణం తీర్చుకునేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు కపిలతీర్థం చేరుకున్నారు. పురోహితులు సైతం రూ.500 నుంచి రూ.5వేల వరకు ఇష్టారాజ్యంగా దక్షిణ వసూలు చేయడంతో పలువురు ఇబ్బందిపడ్డారు. అయితే జన వాహినికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో టీటీడీ అధికారులు విఫలమయ్యారు. పోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు చేపట్టారు.

– తిరుపతి కల్చరల్